

## అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు

ఏటా వేసవికాలంలో అంతులేని నష్టం ■ అగ్నికి ఆహుతవుతున్న విలువైన వృక్ష సంపద, వన్యప్రాణులు


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శనివారం | 22 మార్చి 2025 | ■ 12 పేజీలు




## మండుటెండల్లోనూ
# నిండా ముంచే..

■ అకాల వర్షంతో తడిసిన ధాన్యం
■ కల్లాల్లో కొట్టుకుపోయిన మొక్కజొన్న
■ ఈదురుగాలులకు వందల ఎకరాల్లో రాలిపోయిన మామిడి
■ విరిగిపడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
■ కరెంటు సరఫరాకు అంతరాయం
■ కాగజ్‌నగర్‌లో గోడకూలి వృద్ధుడి మృతి
■ గాలివానకు ఉమ్మడి జిల్లా ఆగమాగం..

10

అకాల వర్షం.. వడగండ్లు అన్నదాతల పుట్టి ముంచాయి.. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ముంచేసింది. చెట్లపై ఉన్న మామిడి కాయలను రాల్చేసింది. ఈదురు గాలులతో విరుచుకుపడి పలువురి ప్రాణాలనూ బలిగొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన వాన బీభత్సం సృష్టించింది.

కోతకు వచ్చి రోడ్లమీద ఆరబోసిన మొక్కజొన్న కొట్టుకుపోయింది. ఈదురుగాలుల ధాటికి ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీలో ఇంటి గోడ కూలి దావులత్ (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక పోచమ్మ గుడి వద్ద 150 ఏళ్ల భారీ మర్రి చెట్టు నేలకొరిగింది. కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ సమీపంలో రహదారిపై విద్యుత్ తీగలు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిర్యాణి మండలంలోని అటవీ ప్రాంతంలో భారీ వర్షానికి గుండాల జలపాతం ఉప్పొంగింది. మండు వేసవిలో ఒక్కసారిగా జలకళను సంతరించుకుంది. మిర్చి తోటల్లో పంట నేలరాలింది. మామిడి తోటల్లో కాయలు రాలిపడటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

- ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి



### పది ప్రశ్నపత్రం
## తారుమారు

■ ప్రశ్న పత్రం మార్చి ఇచ్చిన అధికారులు
■ ప్రశ్న పత్రం చూసి కంగుతిన్న విద్యార్థులు
■ మంచిర్యాలలో 2 గంటలు ఆలస్యంగా పరీక్ష
■ విద్యార్థులకు అదనపు సమయం కేటాయింపు
■ పేపర్ లీక్ అవాస్తవం ■ కలెక్టర్ కుమార్ దీపక్
■ విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు
■ ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్ - వివరాలు2లో



### తాగునీటి ఎద్దడి రాకుండా
## చర్యలు తీసుకోవాలి

ఖండాల గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఖండాల గ్రామంలో 68 కుటుంబాలు, 342 జనాభా ఉందని, ఖండాల గ్రామం నుండి 4కిలో మీటర్ల దూరంలో వాగు వద్ద బోర్‌వెల్ వేసి అక్కడి నుండి పైపు లైను ద్వారా ఉదయం, సాయంత్రం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. 12లో

# పది పరీక్షలు ప్రారంభం



■ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

పదవ తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిరోజు పరీక్షకు 10,022 మంది విద్యార్థులు హాజరు కాగా, 32 మంది గైర్హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 10,043 మందికి 10,013 మంది హాజరు కాగా, 30 మంది గైర్హాజరయ్యారు. 99.70 శాతం హాజరు నమోదైంది. ప్రైవేట్ విద్యార్థులు 13 మందికి గాను 9 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. 81.82 శాతం హాజరు నమోదైంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. వివరాలు3లో



## జైపూర్‌లో అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్

■ జైపూర్‌లో 3వ యూనిట్‌కు శంకుస్థాపన
■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
■ అనుకూలించని వాతావరణం..
■ ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
■ ఇంకా ఖరారు కాని షెడ్యూల్

12 లో

జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) ఆవరణలో సింగరేణి సంస్థ కొత్తగా నిర్మించనున్న 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్‌కు శంకుస్థాపనకు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. మొదట ఈ నెల 23న సీఎం పర్యటన ఉంటుందని జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు ప్లాంట్ సింగరేణి, పోలీసులు, స్థానిక అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదు.



# పది ప్రశ్నపత్రం తారుమారు

- ఒకదానికి బదులు మరొకటి అందజేత
- రెండు గంటలు ఆలస్యంగా పరీక్ష
- విద్యార్థులకు అదనపు సమయం కేటాయింపు
- మంచిర్యాలలో పేపర్ లీక్ అవాస్తవం...
- కలెక్టర్ కుమార్ దీపక్ సీరియస్
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు..
- ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్



**మంచిర్యాల, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
మంచి ర్యాల పట్టణంలో బాలుర పాఠశాలలో పదో తరగతి పరీక్షలో గందరగోళం నెలకొంది. విద్యార్థులకు శుక్రవారం తెలుగు పరీక్ష నిర్వహించాల్సి ఉండగా దానికి బదులు హిందీ పేపర్‌కు సంబంధించిన బెండల్ రావడంతో సంబంధిత అధికారులు అలర్ట్ అయ్యారు. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్న పత్రాన్ని ఒక్కో ట్రంకు పెట్టెలో ఉంచి వాటిని పోలీసు స్టేషన్‌లో భద్ర పరుస్తున్నారు. బాలుర పాఠశాలకు రావాల్సిన ట్రంకు పెట్టెలో తెలుగు ప్రశ్నాపత్రం బెండల్స్ బదులు రెండవ రోజు జరగాల్సిన హిందీ ప్రశ్నాపత్రం వచ్చింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ కుమార్ దీపక్ పరీక్షా కేంద్రానికి చేరుకుని ఎస్సెస్సీ బోర్డు అధికారులకు సమాచారం అందించారు. తారుమారైన ప్రశ్నాపత్రాల బెండిల్‌ను సరి చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతితో పోలీసు స్టేషన్‌లో ఉంచిన ట్రంకు పెట్టెను సీల్ తీసి ఈరోజు జరగాల్సిన తెలుగు ప్రశ్నాపత్రం బెండల్‌ను సెంటర్‌లో ఉన్న విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకు సుమారు గంటన్నర సమయం పట్టింది. దీనితో ఉన్నతాధికారుల సూచన మేరకు రెండు గంటల అలస్యంగా పరీక్షను ప్రారంభించారు. 11.30 నిమిషాల నుంచి 2.30 గంటల వరకు సమయాన్ని కేటాయించారు. విద్యార్థులకు స్నాక్స్‌తోపాటు తాగునీటిని అందించారు. ఈ పరీక్షా కేంద్రంలో 8200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

**మంచిర్యాలలో పేపర్ లీక్ అవాస్తవం...**
జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయని, సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్టు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్బీహెచ్వీ, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, తహసీల్దార్ రఫతుల్లాలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచినట్టు చెప్పారు. జిల్లాలో పరీక్షల నిర్వహణకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి రోజు 9 వేల 183 మంది హాజరు కావాల్సి ఉండగా 9 వేల 163 మంది హాజరయ్యారని తెలిపారు.

**విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు..**
మొదటి రోజున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష 2 గంటల ఆలస్యంగా ప్రారంభమైందని కలెక్టర్ దీపక్ కుమార్ తెలిపారు. రోజు వారీగా, ప్రశ్నాపత్రాల సెట్ల వారీగా పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రాలను బందోబస్తు మధ్య ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని చెప్పారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుండి స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించే క్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం-03015 కు తరలించే ట్రంక్ బాక్సులో రెండవ రోజు పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఉన్నాయని గమనించినట్టు చెప్పారు. పరీక్షా కేంద్రానికి రావలసిన ప్రశ్నాపత్రాల బాక్సులను వెతకడంతో గంటన్నర సమయం పట్టిందని అన్నారు. అయితే ఉన్నతాధికారుల అనుమతి పొంది విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను 2 గంటల ఆలస్యంగా ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. 2 గంటలు ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనందున విద్యార్థులకు స్నాక్స్ అందించినట్టు చెప్పారు. ట్రంక్ బాక్సుల్లో గుర్తించిన రెండవ రోజు పరీక్ష ప్రశ్నాపత్రాలను తెరవలేదని, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, పేపర్ లీక్ అయిందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించిన పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు మీర్ సప్టర్ అలీఖాన్, శాఖ అధికారి ఎన్.ఆర్. పద్మజ లను సస్పెండ్ చేయడం జరిగిందని, ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొదటి రోజు 99.74 శాతం హాజరు నమోదు కావడం జరిగిందన్నారు.



## జన్నారంలో డిగ్రీ పరీక్ష
# కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
### డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత



**జన్నారం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మండలంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ రావుకు వినతి పత్రం అందించారు. సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకులు మనీష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రం లేకపోవడంతో చాలామంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అవుతున్నారన్నారు. డిగ్రీ పరీక్షా కేంద్రం లక్షెట్టిపేటలో ఉండడంతో విద్యార్థులకు దూర భారం పెరుగుతుందన్నారు. బస్సులలో వెళ్లాలంటే తీవ్రమైన రద్దీ నెలకొంది అన్నారు. దీంతో చాలామంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. జన్నారం పరిసర ప్రాంత గ్రామాల్లో అధికంగా పేద విద్యార్థులే ఉండడంతో, పరీక్షల సమయంలో అంత దూరం వెళ్లలేక పోతున్నామన్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే జన్నారం మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నామన్నారు కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థులు,గట్టు వైష్ణవి, షహనా, అంజని, నవత, ఆర్య, అఖిల, ప్రత్యూష, సంఘవి, కావ్యంజలి, హారిక, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
### నేతకాని సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



**జన్నారం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఎస్సీలో ఉన్న నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని నేతకాని సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. శుక్రవారం జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దుర్గం లక్ష్మి నారాయణను శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నేతకాని కులాన్ని గుర్తించి జన్నారం మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దుర్గం లక్ష్మీనారాయణ ను నియమించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యేకు నేతకాని సమాజమంతా రుణపడి ఉంటుందన్నారు. నేతకాని కులస్తులు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారన్నారు. నేతకాని కులస్తులు అభివృద్ధి చెందాలంటే కార్పొరేషన్ ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర అధికార ప్రతినిధి గోల్లే రాజా మల్లు, జన్నారం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకటయ్య, బండారి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# దండేపల్లిలో వడగండ్ల వాన బీభత్సం

**జన్నారం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంంలో ఒక్కసారిగా వడగండ్ల వాన కురిసింది. శుక్రవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. కొన్ని ప్రాంతాల్లో వరి పంట పొట్టకు వచ్చి ఉండటం మరి కొన్ని ప్రాంతాల్లో వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉంది. దీంతో అకాల వర్షం వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన పడుతున్నారు. అకాల వర్షానికి కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఇప్పటికే చలి తీవ్రత వల్ల మామిడి దిగుబడి తగ్గే అవకాశం ఉండగా ఈదురు గాలులతో అక్కడక్కడా మామిడి కాయలు నేలరాలాయి. మరికొన్ని భారీ వృక్షాలు నేలకొరిగాయి. వచ్చే రెండు రోజులు కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో మామిడి రైతుల్లో ఆందోళన మొదలైంది.







## పది పరీక్షలకు రాసే
# దివ్యాంగులకు సౌకర్యాలు

**ముథోల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ముదోల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. భైంసా పట్టణ కేంద్రంలో ఓ పరీక్ష కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మెట్లు ఎక్కి రూమ్‌కు చేరుకునే విషయంలో సిబ్బంది వాళ్ళను తమ భుజాలపై ఎక్కించుకుని రూమ్‌లో దిగబెట్టారు. మరో దివ్యాంగుడు రాయలేని స్థితిలో ఉండగా వారికి ప్రత్యామ్నాయంగా దివ్యాంగుడు డిక్టేషన్ రూపంలో చెప్తే రాసే వారిని సైతం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి పరీక్ష తెలుగు కాగా, విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసులు పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో రావాలని అధికారులు సూచించారు.





# ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

**మొదటిరోజు టెన్త్ పరీక్షలో 30 మంది గైర్హాజర్ - పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో మొదటి రోజు పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలుగు సబ్జెక్టు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 30 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. మొత్తం 10043 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాలలో 10013 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా ఈ పదవతరగతి పరీక్షలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో పాటు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అదనపు కలెక్టర్ శ్యామల దేవి, స్పెషల్ సూపరింటెండెంట్లు ఆయా కేంద్రాలను పరిశీలించారు. విద్యానగర్ లోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మరి కొన్ని పరీక్ష కేంద్రాలలో జిల్లా ఎస్పీ సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని డీఈఓ ప్రణీతను అడిగి తెలుసుకున్నారు. సీ.సీ కెమెరాల నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్.ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను పరిశీలించి పరీక్షలు అయ్యేంతవరకు పకడ్బందీగా వ్యవహరించాలని, విద్యార్థులు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర పరీక్షా కేంద్రాలకు తీసుకురాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి ఘటనలు జరు గకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని, అవసరమైన అన్ని మౌళిక వసతులను కల్పించామన్నారు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి
### జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి



**దండేపల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ధర్మరావుపేట మోడల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి శుక్రవారం ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. లబ్దిదారులు పనులు ప్రారంభించుకుని తొందరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ జాగర్లమూడి ప్రసాద్, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, తోట మోహన్, బొడ్డు కమలాకర్, నాయకులు కంది సతీశ్‌కుమార్, గడ్డం రాంచందర్, జాబు కాంతారావు, అనవేని తిరుపతి పాల్గొన్నారు.

## హమాలీల సమస్యలపై కలెక్టర్ సమీక్ష



**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
కలెక్టరేట్ సమావేశ మందిరంలో హమాలీల సమస్యలు, లైసెన్సులపై శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించి, కమిటీతో చర్చించారు. వ్యవసాయ కమిటీలలో హమాలీలకు కొత్తగా లైసెన్సులు ఇచ్చేందుకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కమిటీల అధికారులకు హమాలి లైసెన్సులు జారీ చేసేందుకు పేపర్ ప్రకటన ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఎంపిక ప్రక్రియను మార్చి చివరిలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా. మేనేజర్ మార్క్‌ఫెడ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, సీఈవో-గుడిహత్నూర్ పీఏసీఎస్, సబ్ కలెక్టర్ ఆర్.డి.ఓలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెటింగ్ , మార్క్ ఫెడ్, సహకార శాఖ, అధికారులు, తదితరులు ఉన్నారు.



## సమస్యల పరిష్కారం కోసం దశల వారీపోరాటాలు

**కడెం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఆలసత్వం వహించకుడదని, తక్షణమే పీఆర్సీ, డీఏలను విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పూర్తి అలవెన్స్‌లు క్లియర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్లను అందజేయాలని, ఉపాధ్యాయుల పదవీ విరమణ కార్యక్రమాన్ని అధికారికంగా ఎంఆర్సీలో నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు మధుకర్, మునేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబాజీ నాయక్, సులోమన్‌నాయక్ పాల్గొన్నారు.

## ఇసుక రీచ్‌లను గుర్తించి నివేదిక ఇవ్వాలి
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలసి సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం జిల్లా కలెక్టర్ చైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ, ట్రైన్ కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్, ఏడి మైన్స్, డిడి గ్రౌండ్ వాటర్ ఇరిగేషన్ పెన్‌గంగా అధికారులు తదితరులు పాల్గొన్నారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు జైనథ్, భీంపూర్, బేల, సాత్నాల, బోరజ్, అధికారులను స్థానిక అవసరాలకు గాను తహసిల్దారులు సంబంధిత మండలంలో ఇసుక రీచ్‌లను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తహసీల్దార్లు ఇసుక రీచ్‌లను గుర్తించి ఇస్తే గ్రౌండ్ వాటర్, ఎడి మైన్స్, ఇరిగేషన్ రెవెన్యూ, అధికారులు అందరూ కలిసి ఎంత ఇసుక ఉన్నది స్థానిక అవసరాలకు ఎంత వాడుకోవచ్చు ఆ వివరాలను నివేదిక రూపం లో త్వరగా పంపాలని ఆదేశించారు.

## 24న ఆదిలాబాద్‌లో జాబ్ మేళా

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ లో ఈనెల 24వ తేదీ సోమవారం టీఎస్ కేసి ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జె సంగీత, టి ఎస్ కే సి కోఆర్డినేటర్ డాక్టర్. ఐ.శ్రావణి, ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో హెచ్. డీ ఎఫ్.సీ యాక్సిస్ బ్యాంక్ లో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 30 సంవత్సరాల లోపు ఉండి ఏదైనా డిగ్రీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఒక జత రెస్యూమే, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒరిజినల్ అండ్ జిరాక్స్ సెట్, ఐడి ప్రూఫ్, పాన్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుండి ఈ జాబ్ డ్రైవ్ ప్రారంభం అవుతుందని వివరాలకు 8106764653, ఎండి. ఇమ్రాన్ అలీ 9703533626ను సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు.

## ఎల్ఆర్ఎస్ అమలులో పురోగతి సాధించాలి

**కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్**



**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
2020 స్కీమ్ క్రింద ప్లాట్ల క్రమబద్దీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల కొరకు ప్రభుత్వం 25 శాతం రిబేట్‌తో కూడిన చెల్లింపు ద్వారా ఎల్.ఆర్.ఎస్ క్రమబద్దీకరణ ఫీజును మార్చి నెలాఖరులోపు చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని ఈ విషయాన్ని ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులకు వివరిస్తూ, రిబేట్ సదుపాయం సద్వినియోగం చేసుకునేలా చూడాలని, ఇప్పటి వరకు ఎంతమంది పెమెంట్ చేశారు. తదితర వాటిపై శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా దాన కిషోర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం మున్సిపల్, పంచాయతీ దరఖాస్తులు 20,381 దరఖాస్తులలో 1584 పే చేయడం జరిగిందని, ఇందులో 620 మందికి ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. మిగితా పెండింగ్ దరఖాస్తులు ఈ నెల 31 లోగా పేమెంట్ చేయాలనీ, గడువులోగా కడితే 25 శాతం రీబెట్ వర్తిస్తుందని, గడువు ముగిసిన తరువాత 25 శాతం రిబెట్ వర్తించదని అన్నారు. మున్సిపల్, పంచాయతీ, మీ సేవల ద్వారా కూడా కట్టవచ్చని, ఈ అవకాశం కొద్ది రోజులే ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్, సంభందిత అధికారులు పాల్గొన్నారు.



### పొరపాట్లకు తావివ్వకుండా

# పది పరీక్షలు నిర్వహించాలి

**పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్, సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరాల నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులను పరిశీలించి పరీక్షలు అయ్యేంతవరకు పకడ్బందీగా వ్యవహరించాలని, విద్యార్థులు సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర పరీక్షా కేంద్రాలకు తీసుకురాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి ఘటనలు జరుగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని, అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించామన్నారు జిల్లా అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావ్, అధికారులు పరమేశ్వర్, తహసీల్దార్‌లు మల్లేష్, రాజు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

---

### సదర్మాట్ చివరి ఆయకట్టుకు

# నీరందించాలి



**కడెం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సదర్మాట్ కాల్వ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్ హపావత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కడెం ప్రాజెక్ట్ ఈఈ విఠల్‌కు మండలంలోని చిట్యాల్ గ్రామ రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలాలు పట్ట దశలో ఉన్నాయని, రెండు తడులు నీరు అందకుంటే పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు చిట్యాల్, బెల్లాల్ వరకు నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఈఈ స్పందిస్తూ తక్షణమే సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేశ్, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి, లింగయ్య, రాజు పాల్గొన్నారు.

---

# ఎల్ఆర్ఎసపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్



**నిర్మల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుండి ఎంఏఅండ్ యూడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలు, మున్సిపాలిటీల వారిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ)కు దరఖాస్తు చేసుకున్న వారందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పలువురు దరఖాస్తుదారులం తా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పరిధిలలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31 వ తేదీతో లే అవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, యాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# అభివృద్ధి పనులకు భూమి పూజ



**నిర్మల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీలో, లక్ష్మణ్ చాంద వడ్యాల్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఇందులో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పొన్నాల రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, రాంరెడ్డి తదితరులున్నారు.

---



# కాగజ్‌నగర్‌లో జిరాక్స్ సెంటర్ సీజ్

**కాగజ్‌నగర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్‌లోని ఓజిరాక్స్ సెంటర్‌ను తహసీల్దార్ కిరణ్ కుమార్ సీజ్ చేశారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్న నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను షాపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ వెల్లడించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రాళ్ల వాన.. రైతుల ఆవేదన

**కాగజ్‌నగర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో శుక్రవారం సాయంత్రం రాళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి దుమారంతో వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. కాగా వర్షానికి వరి, మామిడి రైతులు పంట నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగజ్‌నగర్‌లో ఇంటి గోడ కూలి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఆసిఫాబాద్‌లో భారీ వృక్షాలు నేలకూలాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ముందే హెచ్చరించింది. రానున్న రోజుల్లో కూడా జిల్లాలో వడగండ్ల వాన కురిసే అవకాశముంది.

---

# దివ్యాంగులకు యూడిఐడీ కార్డు తప్పనిసరి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ - యూడిఐడీ కార్డుల జారీపై మార్గదర్శకాలు, దివ్యంగుల సమస్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష**





**నిర్మల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
అర్హులైన దివ్యాంగులకు యూడిఐడీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూడిఐడీ కార్డుల జారీపై మార్గదర్శకాలు, దివ్యంగుల సమస్యలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, దివ్యాంగులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్‌కు బదులుగా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి యూనిక్ డిసెబిలిటీ ఐడీ నంబర్‌ను కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్చి 1, 2025 నుండి దివ్యాంగుల పునరావాసం, సాధికారత కోసం డైనమిక్ వెబ్ ఎనేబుల్ సిస్టమ్‌ను రూపొందించిందని తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా నూతనంగా యూడిఐడీ కార్డులను జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఉన్నవారు, నూతనంగా యూడిఐడీ కార్డుల కోసం మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ చేసి, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూడిఐడీ కార్డులు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్డులు 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులకు అందించడం జరుగుతుందని, స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇంటి చిరునామాకు అందుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన దివ్యంగులకు ప్రభుత్వ పథకాల లబ్ధి, పునరావాసం, సాధికారతను మెరుగుపర చడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం యూడిఐడీకార్డుల జారీ మార్గదర్శకాలపై సంబంధిత విభాగాల వైద్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, దివ్యాంగులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ ఆలయానికి బోరు మోటర్ అందజేత

**నెన్నెల, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ లోని హనుమాన్ ఆలయానికి బోర్ మోటార్ ను శుక్రవారం మాజీ ఎంపీటీసీ బొమ్మన హరీష్ గౌడ్ అందించారు. ప్రతి ఏడాది హనుమాన్ స్వాములు అక్కడ విడిది చేస్తుండడంతో నీటి సమస్య ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నారు. సానుకూలంగా స్పందించిన మాజీ ఎంపీటీసీ నూతన బోరును అందజేశారు.

## 13వ వార్డులో పారిశుధ్య పనులు



**బెల్లంపల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు గంగారం నగర్‌లో శుక్రవారం పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో సిబ్బంది మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను ఎక్కడికక్కడ తొలగించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**తలమడుగు, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తలమడుగు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన కుమ్మరి లింగన్న (48)కు సుంకిడి శివారు ప్రాంతంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పత్తి పంట పండించగా పంట దిగుబడి రాలేదు. పంట సాగు చేసేందుకు బ్యాంక్‌లో రూ.3 లక్షలు అప్పు చేశాడు. రైతు భరోసా రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో శుక్రవారం తన పొలానికి వెళ్లి చేనులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లింగన్నకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంజమ్మ తెలిపారు.

## బైంసా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ జానకి షర్మిల



**ముథోల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
భైంసా రూరల్ పోలీస్ స్టేషన్‌ను ప్రతి పోలీస్ స్టేషన్ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శుక్రవారం వార్షిక తనిఖీలలో భాగంగా బైంసా రూరల్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, స్థానిక సీఐ నైలు, ఎస్సైలను అభినందించారు. ఎస్పీకి రూరల్ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం మొక్కలను నాటారు. ప్రతి ఒక్క పోలీసు విధులలో నిబద్ధత చూపించాలని అన్నారు.

# ప్రతీ ఒక్కరు నిబద్ధతతో విధులను నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి
- శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలి
- అదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్,మహిళా పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
శాంతి భద్రతలను పరిరక్షణ ప్రతి ఒక్క పోలీసు ప్రధాన లక్ష్యంగా పట్టణంలో మరింత ఉత్సాహంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ మరియు మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ మొదటగా సిబ్బంది ద్వారా పూల మొక్క అందుకొని స్వాగతాన్ని స్వీకరించారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లో సందర్శించి పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న కేసులపై చార్జ్ సీటు దాఖలు చేసి బాధితులకు సత్వర న్యాయం అదే విధంగా కృషి చేయాలన్నారు. ప్రజలకు ప్రతి ఒక్క పోలీసు అధికారి సకాలంలో నాణ్యమైన సేవలను అందించినప్పుడే పోలీసు వ్యవస్థ యొక్క కీర్తి ప్రతిష్టను పెంపొందించబడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులను నిర్వర్తించాలని సూచించారు. నూతన పోలీసు సిబ్బంది ప్రతి ఒక్క పోలీసు విధులను నేర్చుకుని నూతన ఉత్సాహంతో విధుల నిర్వర్తించాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ కై నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు, ట్రాఫిక్ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా మహిళల సమస్యలపై త్వరితగతిన స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మహిళా పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన మహిళలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇస్తూ కుటుంబ సమస్యలను పరిష్కరించాలని లేని యెడల చటపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకున్న క్షణాల వ్యవధిలో సంఘటన స్థలాలకు చేరుకునే విధంగా అప్రమత్తమై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు సునీల్, శ్రీనివాస్ ఎస్ఐలు అశోక్,పద్మ, ఇసాక్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే

**ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**



**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
బీసీ జనాభాను కులగణనలో తగ్గించి చూపించారని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై మాకు అనుమానాలు ఉన్నాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. బీసీలు 56 శాతం ఉన్నప్పటికీ 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారని, అయినా దీనిని తాము ఆహ్వానిస్తున్నామన్నారు. అయితే ఇందులో ముస్లిం మైనార్టీలకు 10 శాతం మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర బీసీలు గమనిస్తున్నారని, ముస్లిం మైనార్టీలకు 10 శాతం ఇస్తే ఇది బీసీలను మోసం చేసినట్టే అవుతుందన్నారు. ఈ విషయంలో బీసీలు ప్రభుత్వాన్ని నిక్కచ్చిగా అడగాలని కోరుతున్నానన్నారు తాము ప్రభుత్వాన్ని అడిగినా ఈ విషయంలో సమాధానం రాలేదని పాయల్ శంకర్ ఆరోపించారు. ప్రభుత్వా నికి సమయం ఇస్తున్నామని, ఆలోపు నిర్ణయం తీసుకోకపోతే సోమవారం జరిగే చర్చలో దీన్ని అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు. డీలిమిటేషన్ విషయం ఇంకా కొలిక్కి రాలేదని, అప్పుడే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెన్నైలో జరిగే సభకు వెళ్తున్నా రంటే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని స్పష్టం అవుతోందని పాయల్‌శంకర్ ఆరోపించారు.

## ధూమపానం, బహిరంగ మలమూత్ర విసర్జనపై తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రచారం



**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ధూమపానం, బహిరంగ మలమూత్ర విసర్జనపై తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తమిళనాడు రాష్ట్రం లోని డిండిగుల్ జిల్లాలోని లింగనవాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. బహిరంగ మలమూత్ర విసర్జనపై ఆసిఫాబాద్ జిల్లా కౌటల మండలానికి చెందిన కొండగుర్ల శ్రీశైలం, దాంతో పాటు ఆయన సహా విద్యార్థి పార్థసారథి అవగాహన కల్పించారు. ధూమపానం వల్ల కలిగే నష్టాలను వివరించారు.మానవ చాలా విలువైనదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన కేంద్ర విద్యార్థులు నందనారాయణన్,మొహమ్మద్ అబ్దుల్ కలాం, ముత్తుకామచ్చి,నవీన్ కుమార్,మిథున్, ముత్తుకుమార్,మధన్, మిత్రన్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని లిటిల్ స్టార్ హైస్కూల్‌చ గవర్నమెంట్ గెజిటెడ్ నెంబర్ వన్ హై స్కూల్ లలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలలోనికి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదన్నారు. జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష పూర్తి అయ్యేంతవరకు మూసి ఉంచే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**ఇంద్రవెల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లికి చెందిన చౌహన్ అర్జున్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి రూపాయి 60 వేల చెక్కును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చెక్కును లబ్ధిదారునికి అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి జహీర్, ఎఎంసి డైరెక్టర్ కొడప శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సుంకట్ రావ్,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి మసూద్,ఫడ్ వరుణ్,సుర కొమరయ్య, జగన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రపంచ వ్యాప్తంగా నీటి సంక్షోభం నెలకొంది. గుక్కెడు నీటికి కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లే దారుణ పరిస్థితులు అనేక దేశాల్లో నెలకున్నాయి. ఆఫ్రికా దేశాల్లో నీటి సమస్య మరింత తీవ్రంగా ఉంది. భారతదేశంలోనూ మరఠ్వాడా సహా అనేక ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. కాగా.. 2050 నాటికి భారత్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంటుందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక తేల్చి చెప్పింది. భూగోళంపై 80 శాతం నీరు విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే సురక్షిత నీరు ప్రజలకు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై ఉంటుంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యల వల్ల పనికి రాకుండా పోతున్నది. దీని ప్రభావం కేవలం మనుషులపైనే కాదు... సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలపై కూడా పడుతున్నది.

# ప్రపంచానికి నీటి కటకట






మనిషి బతకడానికి ఆహారం ఎంత అవసరమో.. నీరు కూడా అంతే అవసరం. మనిషి ఆరోగ్యంగా బతకడానికి సురక్షిత నీరు ఎంతో ముఖ్యం. సురక్షిత నీరు అందకపోతే మనుషులు రోగాలపాలవుతారు. కొంతమంది ప్రాణాలు కొడిగట్టి పోతాయి. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రస్తుతం నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సురక్షిత నీటికి కోట్లాది మంది దూరంగా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 26 శాతం జనాభాకు సురక్షిత తాగు నీరుకు నోచుకోవడం లేదని లెక్కలు తేల్చి చెబుతున్నాయి. ఇంతకంటే దారుణం ఇంకేముంటుంది ? ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం మధ్యఆఫ్రికా, తూర్పు ఆసియా, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలు పర్యావరణ మార్పుల కారణంగా సీజన్ల వారీ నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా, సహారా పరీవాహక ప్రాంతాల భవితవ్యం రానున్న రోజుల్లో మరింత దుర్భరం కానుందని నీటి ఎద్దడిపై ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక హెచ్చరించింది. నీటిఎద్దడికి దాదాపుగా ఏ దేశమూ మినహాయింపు కాదు. అయితే నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న జాబితాలో ఆఫ్రికా దేశాలు ముందున్నాయి. ఆఫ్రికాలోని అనేక దేశాల్లో ఇప్పటికీ సురక్షిత మంచినీరు ప్రజలకు అందడం లేదు. అభివృద్ధిలో వెనకబడ్డ దేశాల్లో నీటి కొరత తీవ్రంగా ఉందని లెక్కలు చెబుతున్నాయి. నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఐక్యరాజ్య సమితి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అనేక దేశాలు కోరుతున్నాయి. ప్రజలకు సురక్షిత నీరు అందేలా ఐక్యరాజ్యసమితి కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రపంచ దేశాలు కోరుతున్నాయి.

**2050 నాటికి భారత్‌లో తీవ్ర నీటిఎద్దడి**

నీటి విషయంలో భారత్‌లోనూ పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేవు. 2050 నాటికి భారత్‌లో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంటుందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక తేల్చి చెప్పింది. ప్రపంచ దేశాల్లో నీటి ఎద్దడిపై ఐక్యరాజ్యసమితి రెండేళ్ల కిందట మూడు రోజుల పాటు కీలక సమావేశం నిర్వహించింది. వాటర్ కాన్ఫరెన్స్ నిర్వహణకు ముందు యునైటెడ్ నేషన్స్ వరల్డ్ వాటర్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ అనేక సంచలన విషయాలను వెల్లడించింది. నీటి ఎద్దడిని నివారించడానికి అంతర్జాతీయస్థాయిలో బలమైన యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు నీటిరంగ నిపుణులు. ప్రపంచంలోని ప్రజలందరికీ 2023 నాటికల్లా సురక్షిత తాగునీరు అందించాలని ఐక్యరాజ్య సమితి గతంలోనే లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ప్రస్తుతం ఆ లక్ష్యానికి ప్రపంచదేశాలు చాలా దూరంలో ఉన్నాయి. అందరికీ సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యానికి చేరుకోవడానికి ఏడాదికి 600 బిలియన్ల నుంచి ఒక ట్రిలియన్ డాలర్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నీటిరంగ నిపుణుడు రిచర్డ్ కాన్నర్ చెప్పారు. ఏడాపెడా పెరుగుతున్న నీటి ఎద్దడి, అభివృద్ధి పేరుతో పర్యావరణానికి తూట్లు పొడుస్తున్న వైనం, రకరకాల కాలుష్యాలతో పాటు గ్లోబల్ వార్మింగ్ నీటి ఎద్దడికి ప్రధాన కారణాలన్న చేదు వాస్తవాన్ని యునైటెడ్‌నేషన్స్ వరల్డ్ వాటర్ డెవలప్‌మెంట్ తాజా నివేదిక గుర్తు చేస్తోందని నీటిరంగ నిపుణులు పేర్కొన్నారు.

**సురక్షిత తాగునీటికి కటకట**

భూగోళంపై 80శాతం నీరు విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే సురక్షిత నీరు ప్రజలకు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై ఉంటుంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీని ప్రభావం కేవలం మనుషులపైనే కాదు.. సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలపై కూడా పడుతోంది. భూగర్భజల కాలుష్యాన్ని నివారించడానికి ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. భారతీయ సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి అందరికీ తెలిసిందే. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్తా చెదారం, పరిశ్రమల నుంచి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నాయి. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. ప్రజలకు సురక్షిత నీరు అందించాలంటే ముందుగా నదులను కాపాడుకోవడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాల్సి ఉంది. ఇదిలా ఉంటే మనకు అందుబాటులో ఉన్న తాగునీటి నాణ్యతా ప్రమాణాలు సంతృప్తికరంగా లేవంటున్నారు నిపుణులు. అనేక ప్రాంతాల్లో నీరు , రకరకాల లోహాలతో కలుషితం అవుతోంది. ప్రకృతిలోని ప్రతి ప్రాణికి నీరే జీవనాధారం. రోజుకు కనీసం ఎనిమిది నుంచి పది గ్లాసుల మంచి నీరు తాగాలంటున్నారు డాక్టర్లు. స్వచ్ఛమైన తాగునీరు మనుషుల ప్రాథమిక హక్కు అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ. అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల ఏడాదికి 1.4 బిలియన్ల మంది ప్రజలు మరణిస్తున్నారు. మనదేశంలో నీటి వనరులను పరిరక్షించుకోవడంలో అనేక లోపాలున్నాయి. భారతదేశంలో 85 శాతం మంది ప్రజలు ఇప్పటికీ చెరువులు, కుంటలు వంటి సంప్రదాయ నీటి వనరులపైనే ఆధారపడుతున్నారు. జలవనరులు పరిరక్షించడం, నీటి కాలుష్యాన్ని నివారించడంలో ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. పరిశ్రమలు విడుదల చేసే వ్యర్థాలను చెరువులు, కుంటలు ఇతర నీటి వనరుల్లో కలవకుండా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా నీటిని రక్షించుకుందాం.... భవిష్యత్తును కాపాడుకుందాం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సర్వే ప్రకారం 39 శాతం వ్యర్థ జాలాల శుద్ధి కేంద్రాలు , ప్రమాణాలకు అనుగుణంగా లేవు.

## 1972లో మరఠ్వాడాలో తీవ్ర నీటిఎద్దడి

1972-73 ప్రాంతంలో మహారాష్ట్రలోని మరఠ్వాడా ప్రాంతంలో తీవ్ర నీటిఎద్దడి ఏర్పడింది. దాంతో నీటి ఎద్దడిని నివారించడానికి దుష్కాల్ నివారణ్ పేరుతో ఓ ప్రజా ఉద్యమం నడిచింది. ఈ ఉద్యమానికి మేధావులు, విద్యావేత్తలు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న కొంతమంది నేతలు మద్దతు ప్రకటించారు. మరఠ్వాడా నీటి సంక్షోభం మనిషి సృష్టించిన అనావృష్టి అని ఈ ఉద్యమం తేల్చి చెప్పింది. దీనికి విరుగుడు పరీవాహక ప్రాంతాల మధ్య ఉండే ప్రదేశాలను అభివృద్ధి చేయడమేనని ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదలను ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. దానివల్లనే మరఠ్వాడా ప్రాంతం ఇప్పటికీ నీటి ఎద్దడితో నానా ఇబ్బందులు పడుతున్నది.



రక్షితమైన తాగునీరు లేకుండా గౌరవప్ర జీవితాన్ని గడపడం దాదాపు అసాధ్యం. నీటిని పొందడం మానవ హక్కు. అయినప్పటికీ నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 220 కోట్ల మంది సుంక్షిత మైన తాగునీరు అందుబాటులో లేకుండా జీవనం సాగిస్తున్నారు. ఇది వారి జీవితాలకు, విస్తృత సమాజానికి వినాశకరమైన ప్రభావాలను కలుగ జేస్తుంది. ముఖ్యంగా ఆకలి, లింగ సమానత్వం, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, స్థిరత్వం, పర్యావరణ వ్యవస్థలకు సంబంధించి 2030 సుస్థిర అభివృద్ధి ఎజెండా జలచక్రం ఆవశ్యకతను నొక్కిచెప్పింది. అంతేకాక 'అందరికీ నీరు పారిశుధ్యం అందుబా టులో ఉండేలా చూసుకోవాలి. సురక్షితమైన నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత, ఆరోగ్యం, శ్రేయస్సు కోసం అత్యంత ప్రాథమిక మానవ అవసరం. ఈ పురోగతి నాలుగు రెట్లు పెరగకపోతే 2030 నాటికి కోట్ల మంది మంది ప్రజలు ఈ ప్రాథమిక సేవలను కోల్పోతారు" అని ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం తెలుపుతుంది. అందరికీ అవసరం.. నీటి లభ్యత వ్యవసాయానికి, సమాజ స్థిరత్వానికి, శాంతి నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది. వలసలను ఆపుతుంది. విపత్తు ప్రమాద తగ్గింపుకు దోహదం చేస్తుంది. నీరు కొరతగానూ, కలుషితమైనప్పుడు, సరిగా అందుబాటులో లేనప్పుడు ప్రజలు జీవ నోపాధిని కోల్పోతారు. ఆహార భద్రత దెబ్బతిం టుంది. ఇవి సంఘర్షణలకు దోహదం చేస్తుంది. వాతావరణ మార్పులకు అనుగుణంగా సమాజం మారడానికి నీరు కూడా ఒక ప్రధానకారణం. ఇది వాతావరణ వ్యవస్థ, మానవ సమాజం, పర్యావరణం మధ్య కీలకమైన బంధంగా పని చేస్తుంది. ప్రజ లకు నీటిని స్థిరంగా, సమానంగా అందించినప్పుడు శాంతి, శ్రేయస్సులు బలీయంగా ఉంటాయి. సరైన నీటి యాజమాన్యం లేకుండా వివిధ రంగాల సంక్షోభాలు పెరిగే అవకాశం ఉంది. ఇది నీటిపై ఆధారపడిన అనేక రంగాలలో అత్యవసర పరిస్థి తులకు దారితీస్తుంది. 1993 నుండి ప్రతి సంవత్సరం మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం. 'ఇది మంచినీటి ప్రాముఖ్యతపై దృష్టి సారించే వార్షిక ఐక్యరాజ్యసమితి ఆచారం.' 'హిమానీనదాలను సంరక్షించుకోవాలి' అనేది ఈ ఏడాది ఇతివృత్తంగా ఉంది. మొదటి ప్రపంచ హిమానీనదాల దినోత్సవం.. క్రయోస్పియర్, వాతావరణ మార్పు, జలచక్రం, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, సమాజం మధ్య కీల కమైన సంబంధాల గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంచడానికి 2025 ను అంతర్జాతీయ హిమానీనదాల సంరక్షణ సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. మార్చి 21న మొదటి ప్రపంచ హిమానీనదాల దినోత్సవాన్ని నిర్వహించ నున్నారు. మంచు లేదా మంచు చలి. భూమి మీద మంచు, మంచు స్థితిని క్రయోస్పియర్ అంటారు. ఇది ప్రతి జీవిని ప్రభావితం చేస్తుంది. వాతావరణం, జల చక్రాన్ని అర్థం చేసుకోవడానికి క్రయోస్పియర్ శాస్త్రీయ పరిశోధనను ముందుకు తీసుకెళ్లడానికి ఐక్యరాజ్యసమితి 2025-2034 వరకు క్రియోస్పిరిక్ సైన్సెస్ కోసం దశాబ్ద చర్యను ప్రకటించింది. హిమానీనదాల ప్రాముఖ్యత.. భూమిపై ఉన్న మంచినీటిలో దాదాపు 70 శాతం మంచు లేదా మంచు రూపంలో ఉన్నాయి. దాదాపు 200కోట్ల మంది ప్రజలు తాగునీరు, వ్య వసాయం కోసం హిమానీనదాలు, కరగుతున్న మంచు, పర్వతాల నుండి వచ్చే నీటిపైనే ఆధార పడతారు. హిమానీనదాలు మానవ జీవితానికి చాలా కీలకం. త్రాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలకు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలకు చాలా అవసరం. హిమానీనదాలు ప్రకృతి ఖజానాలు. అవి విలువైన వనరును కలిగి ఉన్నాయి. కానీ మండుతున్న ఉష్ణోగ్రతలు హిమాల యాల నుండి ఆండీస్ వరకు, ఆల్ప్స్ నుండి ఆర్కిటి క్ వరకు రికార్డు వేగంతో కరిగిపోతున్నాయి. భూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ ఘనీభవించిన నీటి శాతం తగ్గిపోతునే ఉంది. హిమానీనదాల క్షీణత.. ప్రపంచవ్యాప్తంగా హిమానీనదాలు తగ్గిపోతున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) ప్రకారం 2023 సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా హిమానీనదాలు 600గిగాటన్ల కంటే ఎక్కువ నీటిని కోల్పోయాయి.

# అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు

**ఏటా వేసవికాలంలో అంతులేని నష్టం - అగ్నికి ఆహుతవుతున్న విలువైన వృక్ష సంపద, వన్యప్రాణులు**





**ఆసిఫాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

ఏటా వేసవికాలం వచ్చిందంటే చాలు ఎక్కడో ఓ చోట అగ్గి రాజుకుని అడవిలోని చెట్లకు మంటలు అంటుకుంటాయి. కార్చిచ్చురేగి విలువైన వృక్షాలు, జంతువులు ఆహుతవుతుంటాయి. ఆకురాలే కాలం ప్రారంభం కాగానే పొరపాటున అగ్గిరవ్వలు పడి అంతులేని నష్టం జరుగుతుంది. దీంతో పర్యావరణం దెబ్బతింటుంది. కార్చిచ్చుల నివారణకు అటవీశాఖ సిబ్బంది ఫైర్‌లైన్ల నిర్వహణతో అటవీ శాఖ అగ్ని నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 11 అటవీ రేంజ్‌లు రెండు డివిజన్లు ఉన్నాయి. వీటిలో 2445.40 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఉంది. ఇతర జిల్లాలతో పొలిస్తే దీనిలో ఎక్కువగా టేకు ఉండడంతో వేసవి కాలంలో అగ్గి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అడవిలో అగ్గి కనిపిస్తే అందుబాటులో ఫోన్ నంబర్లు కూడా ఉంచారు. జిల్లాలోని మొత్తం 243 బీట్‌లలో అటవీ ప్రాంతంలో అగ్గిపడకుండా అటవీ అధికారులు ముందస్తుగా ఫైర్ లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. బ్లోయర్ల సహాయంతో ఆకులు దగ్గరికి చేసి అంటిస్తారు. దీంతో రోడ్డు మీద నుంచి ఈ లైన్ దాటి లోపలికి వెళ్లే పరిస్థితులు తక్కువగా ఉంటాయి. ప్రతీ సంవత్సరం అటవీ అధికారులు చర్యలు చేపట్టి కొంత అడవి కాలి పోకుండా చూస్తున్నారు. అగ్గిపడితే వన్యప్రాణులకు నష్టం జరగడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతింటుందని అధికారులు చెబుతున్నారు. ఫైర్‌లైన్లతో పాటు గతంతో పోలిస్తే అడ్వాన్స్ టెక్నాలజీని వాడి పర్యావరణ రక్షణ కోసం అటవీ శాఖ కృషి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అడవిలో అగ్గి పడ్డ కూడా ఫారెస్టు వన్ అగ్ని పోర్టల్ శాటిలైట్ ద్వారా వెంటనే సంబంధిత రేంజ్ కార్యాలయంతో పాటు బీట్ అధికారి మొబైల్‌కు జీపీఎస్ పాయింట్‌తో సంక్షిప్త సందేశం వస్తుంది. దీనితో వెంటనే ఆయా బీట్, సెక్షన్, రేంజ్ అధికారులు అలర్ట్ అయి మంటలు ఆర్పుతున్నారు. దీంతో పర్యావరణానికి ఇబ్బంది కాకుండా అనునిత్యం కృషి చేస్తున్నారు. అడవిలో పడే అగ్గికి సంబందించి గ్రామాల్లో అటవీ అధికారులు పెద్ద ఎత్తున వేసవి కాలం వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పోస్టర్ల ఆవిష్కరణ, వాటిని గ్రామాల్లో అంటించడం ప్రత్యేక మొబైల్ నంబర్లు గ్రామస్థులకు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

## పది పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్



**జన్నారం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఎస్సై రాజ వర్ధన్ ఎంఈఓ విజయ్ కుమార్‌లు తనిఖీ చేశారు. శుక్రవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు చేశామని తెలిపారు. మొత్తం మండలంలో, మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు. ఈ రోజు పరీక్షలు రాయవలసి ఉన్న మూడు సెంటర్స్‌లోని 619 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై రాజ వర్ధన్ తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్నారన్నారు.

# పుట్టెడు దుఃఖంతో.. పది పరీక్షకు విద్యార్థిని



**కన్నెపల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

విధి వంచించింది.. అవే ఆమెకు పదవ తరగతి చివరి పరీక్షలు అలాంటి దుర్భర సమయంలో తండ్రిని కోల్పోయి ఓ విద్యార్థి పుట్టెడు దుఃఖంతో దిగమింగుతూ పదో తరగతి పరీక్ష రాసిన సంఘటన కన్నెపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్‌కు చెందిన మంచర్ల శ్రీలత కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఆమె తండ్రి మంచర్ల మల్లయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం నుంచి ఆమెకు పదో తరగతి పరీక్షలు ఉండటంతో ఆమె తన తండ్రిని కోల్పోయిన పుట్టెడు దుఃఖాన్ని మనసులో ఉంచుకొనినిరుపేద కుటుంబంలో జన్మించిన శ్రీలతమనోధైర్యాన్ని పెంపొందించుకొని చదువుపై ఆమెకు ఉన్న మక్కువతో ఓవైపు తండ్రి అంత్యక్రియలు జరుగుతున్న సమయంలోనే ఆమె పదో తరగతి మొదటి రోజు తెలుగు పరీక్షకు హాజరైంది. ఆమె మనోధైర్యం చూసి మండల విద్యాధికారి రాము, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఆమె కుటుంబ సభ్యులు, ఆమెను అభినందించారు.

**అనారోగ్యంతో పరీక్షకు..**

**గుడిహత్నూర్ :** మండలంలోని ధనోరా (బి) జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ప్రతీక్ష పచ్చకామెర్లతో బాధపడుతోంది. శుక్రవారం నిర్వహించిన మొదటి పరీక్షకు హాజరు కాగా, కాసేపటికే అస్వస్థతకు గురైంది. గుర్తించిన ఇన్విజిలేటర్ వెంటనే సీఎస్ దేవిదాస్కు తెలిపారు. దేవిదాస్ ఎస్సై మహేందర్‌కు తెలుపగా అతడు మండలవైద్యాధికారి శ్యాంసుందర్‌కు సమాచారమిచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న వైద్యాధికారి ప్రతీక్షకు ప్రథమ చికిత్స చేశారు. కాసేపటికి కోలుకున్న ఆమె తిరిగి పరీక్ష రాసింది. అనంతరం ఆమెను పీహెచ్సీకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు రాయవచ్చని వైద్యుడు సూచించారు.

**తీవ్ర గాయాలతో విద్యార్థి..**

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సాయి కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు.. ప్రమాదంలో కాలువిరిగింది.. అయినా మనోధైర్యంతో శుక్రవారం నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు రాశాడు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వేమనపల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

వేమనపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ రూ.80 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను నాయకులు సంతోష్, సయ్యద్ అలీలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే లక్ష్యం

**పూర్తిస్థాయిలో ప్రమాదాల నివారణకు చర్యలపై సమీక్షా - పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**





**మంచిర్యాల, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడడమే ప్రధాన లక్ష్యమని సీపీ అంబర్ కిశోర్ ఝా చెప్పారు. శుక్రవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామగుండం కమిషరేట్ పరిధిలో ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై నమ్మకం, భరోసా కలగాలన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్-63, ఎన్‌హెచ్-363, రాష్ట్ర రహదారి ఎస్‌హెచ్-1, ఎస్‌హెచ్-24, ఎస్‌హెచ్-08తో పాటు ఇతర రహదారులలో 2022 నుండి 2024 వరకు జరిగిన ప్రమాదాలు, మృతి చెందినవారి వివరాలు, ప్రమాదాలకు గల కారణాలు, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, తదితర అంశాలపై ట్రాఫిక్, సంబంధిత పోలీస్ స్టేషన్‌ల అధికారులతో రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం 'రోడ్డు సేఫ్టీ' సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ అధికారులు వారి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను, బ్లాక్ స్పాట్స్‌ను పవర్ గూగుల్ మ్యాపింగ్ ద్వారా సీపీకి వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనర్ పరిధి నుంచి చివరి వరకు ప్రయాణించే వారికి ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీపై ఒక నమ్మకం, భరోసా కలగాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బ్లాక్ స్పాట్ల వద్ద పోలీస్, ట్రాఫిక్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి స్పాట్స్ సందర్శించి ప్రమాదాలకు సంబంధించిన కారణాలు గుర్తించాలన్నారు. నివారణ మార్గాలను గుర్తించి పరిష్కార మార్గాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. రేడియం స్టికర్లతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రహదారులపై అవసరమైన చోట వాహన వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్స్‌లను ఏర్పాటు చేయాలని, కెమెరాలు, లైట్లు, స్పీడ్ కెమెరాలు, జంక్షన్‌ల వద్ద, పాదచారులు రోడ్డు దాటే దగ్గర జీబ్రా క్రాసింగ్, లైటింగ్, రోడ్డు రిఫ్లెక్టింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గ్రామాలను సందర్శించి ప్రతీ విషయం తెలుసుకోవాలని, ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్ ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాముఖ్యత ఇవ్వాలని, నేర నియంత్రణలో ప్రధాన పాత్ర సీసీ కెమెరాలు పోషిస్తాయన్నారు. ప్రజల రద్దీ ఉండే ప్రాంతాల్లో విసిబుల్ పోలీసింగ్ ఉండాలని తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కాకుండా స్నాచింగ్, రాబరీ, గంజాయి అక్రమ రవాణాను, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించవచ్చన్నారు. డ్యూటీ సమయంలో సిబ్బంది, అధికారులు స్వీయ రక్షణ పాటిస్తూ, జాగ్రత్తలు తీసుకోని విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసిపి నరసింహులు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, రామగుండం ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఐటీసీ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్, ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, సిసి హరీష్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.




## అటవీ సంరక్షణ అందరి బాధ్యత

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

వివిధ రకాల సంపదతో గిరిజనులకు జీవనోపాధి కల్పిస్తున్న అడవిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎస్ఆర్డీవో గులాబీసింగ్ పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డీఎఫ్ఓ కార్యాలయం వద్ద ఆయన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవిలో నివాసముండే గిరిజనులకు అక్కడే జీవనోపాధి దొరుకుతుందని చెప్పారు. అడవిలో నిప్పు చెలరేగినా ఎవరైనా చెట్లు నరికినా.. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇంటికి ఐదు మొక్కల చొప్పున నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రమోద్ కుమార్, సెక్షన్ ఆఫీసర్లు అహ్మద్ ఖాన్, గులాబ్, ధన్సింగ్, మొహబ్బత్ రావు, బీట్ ఆఫీసర్లు సవిత, జ్యోతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి బలవన్మరణం

**రామకృష్ణాపూర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ఏజోన్ రాంనగర్ ఏరియాకు చెందిన అడ్లకొండ శ్రీకాంత్(32) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ స్థానిక ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సూపర్వైజర్ పనిచేస్తున్నాడు. డబ్బుల లావాదేవీలకు సంబంధించి ముగ్గురు వ్యక్తులు వేధించడంతో భరించలేక తనువు చాలిస్తున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరని కుటుంబసభ్యులు శుక్రవారం ఇంటికి వచ్చి తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్య ఘటన బయటకు వచ్చిందని ఎస్సై తెలిపారు. కాగా మృతుడి భార్య కరోనా సమయంలో మృతిచెందగా ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రౌండ్ టేబుల్ సమావేశంలో

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్




**సిర్పూర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

హైదరాబాదులోని ఎఫ్టీసీసీఐలో ప్రజ్ఞ భారతి ఆధ్వర్యంలో శుక్రవారం బడ్జెట్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్ పద్దులో కాకి లెక్కలు చెప్పిందన్నారు. బడ్జెట్ మీద చూపిస్తున్న అంకెలకు, ఖర్చులకు పొంతనే లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సాయిప్రసాద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## తొలిరోజు 'పది' ప్రశాంతం

**బెల్లంపల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో పదవ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం బెల్లంపల్లిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనకు తావు లేకుండా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం బెల్లంపల్లిలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే భారీ సంఖ్యలో ఆయా సెంటర్లకు చేరుకున్నారు.

# సికిల్‌సెల్‌ను అంతం చేయడమే లక్ష్యం

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

సికిల్‌సెల్‌ను పూర్తిగా అంతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో సికిల్సెల్పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికిల్‌సెల్ వ్యాప్తి, కట్టడి తదితర విషయాలను ప్రొజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు వివరించారు. సికిల్సెల్, ఎనీమియాతో అనేక మంది బాధపడుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాల గురించి వైద్యులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. వారు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. 2047 వరకు రాష్ట్రంలో సికిల్‌సెల్, ఎనీమియా లేకుండా చేయడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సికిల్సెల్తో కణాలు రక్త సరఫరాకు అడ్డంకిగా మారుతాయని చెప్పారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ఉందని తెలిపారు. కేరియర్లో ఎలాంటి లక్షణాలుండవని, ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కౌన్సిలింగ్ ఇస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, ఏటీడీవో అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



## నిర్మల్ జిల్లా ప్రజలకు అందుబాటులో కలెక్టరేట్

### రాబోయే రోజుల్లో కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తా

### కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి

**నిర్మల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ కలెక్టరేట్ పట్టణానికి దూరంగా ఉండడంతో పట్టణ ప్రజల తోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు, ఉద్యోగులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ కేంద్ర మంత్రి వేణు గోపాలచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన కలెక్టరేట్‌తో పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడమా లేక నూతన కలెక్టరేట్ భవనం నిర్మల్‌లో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్మించాడమా అనే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడతానని ఆయన తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జీల సహకారంతో రానున్న మూడున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీని ఉమ్మడి జిల్లాలో బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే ఆదిలాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడే నియోజకవర్గం నుంచి బరిలో ఉంటానని స్పష్టం చేశారు. లేకపోతే అప్పటికి ఆదిలాబాద్ ఎంపీ స్థానం జనరల్ రిజర్వేషన్ అయితే ఎంపీగా పోటీ చేస్తానని వేణు గోపాలచారి స్పష్టం చేశారు.

## బుడగ జంగాలపై ఎందుకీ వివక్ష



**జన్నారం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల సిపిఐఎం కమిటీ ఆధ్వర్యంలో పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని బుడగ జంగాల ఎస్సీ కాలనీలో సమస్యలను తెలుసుకోవడం కోసం పర్యటించడం జరిగిందని ఆ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు గడిచినా నేటికీ మౌలిక వసతులు లేక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్న వారికి గత ప్రభుత్వాలు కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ కనీస సౌకర్యాలు కల్పించకుండా ఎస్సీ బుడగ జంగాల వారిపై వివక్షత చూపుతుందన్నారు. రోడ్లు, మురికి కాలువలు, తాగునీరు, ఇండ్లపై నుంచి ఉన్న 11 కెవి కరెంట్ వైర్లు తొలగించడక పోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దుంపల రంజిత్ కుమార్ సిపిఐఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు, కనికరం అశోక్ సిపిఐఎం జన్నారం మండల కార్యదర్శి, మగ్గిడి జయ మండల కమిటీ సభ్యురాలు మరియు నాయకులు ఆడే చంద్రకళ, ఒరగంటి వనిత, తలండి దీపిక,గెడం లక్ష్మి,కనికరపు జమున తదితరులు పాల్గొన్నారు.

## శిలాజాలు తరలిస్తున్న వాహనం అడ్డగింత

**వేమనపల్లి, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

శిలాజాలను తరలిస్తున్న వాహనాన్ని తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డుకున్నారు. ప్రాణహిత నది తీరంలో వేల ఏళ్ల నాటి నత్తగుల్ల, తాబేలు, చేప ఆకృతిలోని శిలాజరాళ్లు ఉన్నాయి. శిలాజాలను ఎవరో వాహనంలో తరలించడం గమనించిన స్థానికులు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన ఆర్ఎస్ఐ ఖాలీ కన్ను సుంపుటం సమీపంలో 'ఉన్న ప్రాణహిత నదికి పంపి తహసీల్దార్ కార్యాలయానికి వాహనాన్ని తరలించారు. శిలాజాన్ని తీసుకెళ్తున్న వ్యక్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఆర్కియాలజిస్ట్ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో ఫోన్ మాట్లాడించాడు. శిలాజరాళ్లను భద్రపర్చేందుకు తీసుకెళ్తున్నట్లు నిర్ధారించుకుని వాహనాన్ని వదిలిపెట్టారు.



### గని అధికారులు

## వేధింపులు మానుకోవాలి



**కాసిపేట, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

అధికారులు వేధింపులు మానుకోవాలని శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట 1 గనిపై కార్మికులు మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసన తెలిపారు. కార్మికుల డిమాండ్ మేరకు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ యూనియన్లు నిరసనకు పిలుపునివ్వగా యూనియన్లకు సంబంధం లేకుండా కార్మికులు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. అధికారులు కార్మికులను వేధిస్తూ చార్జీషీట్లు, మెమోలు, సస్పెండ్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఫీట్ కార్యదర్శి లక్ష్మినారాయణ, టీబీజీకేఎస్ నాయకులు బైరి శంకర్, అఫ్జలోద్దిన్, బానోత్ తిరుపతి, రావుల సతీశ్వర్మ, కార్మికులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు

### సిర్పూర్ (టి) పోలీసులు సూచన

**కాగజ్‌నగర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

మండలంలో పదవ తరగతి పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో, లైసెన్స్ లేని మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని సిర్పూర్ (టి) పోలీసులు సూచించారు. పరీక్షలకు హాజరైన కొంతమంది విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చలానాలు విధించారు. పోలీసుల హెచ్చరిక మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు. లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడిపితే బండీ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. పిల్లలు ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయబడతాయి. కావున, తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండి, తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా ప్రమాదాలను నివారించాలి అని పోలీసులు సూచించారు.



# మత్తెక్కిస్తున్న వామికా గబ్బి



సోషల్ మీడియాలో ఎవరు ఎప్పుడు ట్రెండ్ అవుతారో చెప్పలేం. అలా ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు యమా ట్రెండిరగ్ అవుతోంది. ఈ బ్యూటీ ఓరకంటతో చూస్తున్న ఫోటోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరా అని అనుకుంటున్నారా.! కేవలం ఒకే ఒక్క తెలుగు సినిమా చేసిన ఈమె మరెవరో కాదు.. వామికా గబ్బి. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'భలే మంచి రోజు' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ఈ మూవీ కమర్షియల్‌గా ఫెయిల్ కావడంతో వామికా మళ్లీ తెలుగులో మరే చిత్రంలో నటించలేదు పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటించింది వామికా గబ్బి. 2007లో 'జబ్ వి మెట్' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఇప్పటివరకు ఈ బ్యూటీకి సరైన బ్రేక్ దక్కలేదు. 2023లో 'ఖుఫియా' అనే హిందీ సినిమాతో వామికా బాగా ఫేమస్ అయింది. ఈ చిత్రంలో ఆమె నటించిన బోల్డ్ సీన్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యాయి. దాంతో ఈ బ్యూటీకి క్రేజ్ కూడా డబుల్ అయ్యింది. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా వచ్చిన 'బేబీ జాన్' మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో వామికా.. టీచర్ పాత్రలో నటించి తన నటనకు గానూ మంచి మార్కులు తెచ్చుకుంది. ఇక అడివి శేష్ హీరోగా వస్తోన్న 'గూఢచారి -2' సినిమాతో మరోసారి తెలుగులో రీ-ఎంట్రీ ఇవ్వనుంది.

# అప్పటికీ ఇప్పటికీ అదే అందం మారలేదు

టాలీవుడ్ సీనియర్ నటి శ్రీయా శరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఒకప్పుడు వరస సినిమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి స్టార్ హీరోల సరసన నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్స్‌తో కూడా తన సత్తా చాటింది. ఇక చాలా కాలంగా ఈ బ్యూటీ అంతగా సినిమాలు చేయడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి తన కూతురుసు చూసుకుంటూ ఉంది. ఈ మధ్య ఈ అమ్మడు పలు సినిమాల్లో స్పెషల్ పాత్రల్లో కనిపిస్తూ సందడి చేస్తుంది. ఇక సినిమాల్లో కంటే ఈ బ్యూటీ ఈ మధ్య సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మతిపోగొడుతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పింక్ కలర్ డ్రెస్‌లో సరికొత్త లుక్‌లో దర్శనం ఇచ్చింది. కుర్ర హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా తన అందంతో మాయ చేస్తుంది ఈ చిన్నది.







# నాకన్నా చిన్నపిల్లాడిలా కనిపిస్తాడు

బాలీవుడ్ ముద్దగుమ్మ జాన్వీ కపూర్ హీరోయిన్ గా హిందీలో రాణిస్తుంది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోతుంది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో జాన్వీ అందాలకు యమా క్రేజ్ ఉంది. అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఈ బ్యూటీ దేవర సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ మెప్పించి మంచి మార్కులు కొట్టేసింది జాన్వీ. ఇక ఇప్పుడు ఈ అమ్మడు దేవర 2లో నటిస్తుంది. అలాగే రామ్ చరణ్ తోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జాన్వీ కపూర్ గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్ స్టార్ హీరో గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆయన వయసు రోజు రోజుకు తగ్గుతుంది అని చెప్పుకొచ్చింది. ఇంతకూ ఆ స్టార్ హీరో ఎవరో తెలుసా.? మీరు గెస్ చేసే ఉంటారు ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ మహేష్ బాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మహేష్ గురుంచి జాన్వీ మాట్లాడిరది. మహేష్ బాబు గురించి మాట్లాడుతూ.. ఆయనకు వయసు అవ్వదు. ఆయనకు రోజు రోజుకు వయసు తగ్గిపోతుంది. ఎంతో హ్యాండ్సమ్ గా ఉంటారు. కొన్నిసార్లు నా కన్నా చిన్నవాడిగా కనిపిస్తారు అని తెలిపింది జాన్వీ. ఈ కామెంట్స్ ను మహేష్ అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. మహేష్ ప్రస్తుతం రాజమౌళి సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుంది. ఇటీవలే ఒడిశాలో షూటింగ్ పూర్తి చేశారు టీమ్. అలాగే జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది.



# వెండి తెరపై సునీత విలియమ్స్ బయోపిక్

సునీతా విలియమ్స్.. ఈ పేరు ఇప్పుడు యావత్ ప్రపంచం మొత్తం మారోమోగిపోతోంది. భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీత విలియమ్స్ దాదాపు 9 నెలల పాటు అంతతరిక్షంలోనే గడిపి మంగళవారం(భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున 2.41 గంటలకు) స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో భూమి మీదకు వచ్చింది. సునీత క్షేమంగా రావాలంటూ యావత్ ప్రపంచం కోరుకుంది. ఆమె క్షేమంగా భూమి మీదకు చేరుకుందనే వార్త తెలియగానే సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరు సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. ఆమె చేసిన సేవలను, సాహసాలను కొనియాడుతూ పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో సునీతా విలియమ్స్ గురించి ఓ ఆసక్తికర న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. త్వరలోనే ఆమె జీవిత చరిత్ర ఆధారంగా ఓ సినిమా రాబోతుందట. ఆమె చేసిన సాహోసోపేతమైన యాత్రలను వెండితెరపై ఆవిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నయట. ఇప్పటికే బాలీవుడ్కి చెందిన పలువురు దర్శక నిర్మాతలు సునీత లైఫ్ జర్నీని కథగా మలిచే పనిలో పడ్డారట. బాలీవుడ్‌లోనే కాకుండా హాలీవుడ్‌లోనూ సునీతా విలియమ్స్ బయోపిక్ గురించి చర్చలు జరుగుతున్నాయట. సునీత విలియమ్స్ జీవితంలోని స్ఫూర్తిదాయక అంశాలు, ఆమె శిక్షణ, నాసాలో చేరడం, అంతరిక్షంలో 322 రోజులు గడపడం, మరియు భూమికి సురక్షితంగా తిరిగి రావడం.. ఈ అంశాలతో భారీ బడ్జెట్లో ఓ సినిమా చేసేందుకు బాలీవుడికి చెందిన బడా డెరెక్టర్ ఆసక్తి చూపిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. భారత్ సునీతకు సంబంధం ఉండడంతో ఆమె బయోపిక్ని ఇక్కడ కచ్చితంగా ఆదరిస్తారని దర్శకుడు బలంగా నమ్ముతున్నాడట. మరి సునీతా బయోపిక్ వచ్చేది హాలీవుడ్ లోనా? లేదా బాలీవుడ్లోనా? చూడాలి.

# వోడ్కాను తప్పితే.. దేనినీ ప్రమోట్ చేయను..

## రాంగోపాల్‌వర్మ

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వివాదం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు తెలుగు సినీ సెలబ్రిటీలతో పాటు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. అయితే తాజాగా ఈ వివాదంపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించాడు. రామ్ గోపాల్ వర్మ నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం శారీ. యథార్థ సంఘటనల ఆధారంగా వస్తున్న ఈ చిత్రంలో ఆరాధ్య దేవి కథానాయికగా నటిస్తుంది. వర్మ ఈ సినిమాకు కథను అందించగా.. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆర్వీప్రొడక్షన్స్ పతాకంపై రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని ఏప్రిల్ 04న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ప్రమోషన్స్ నిర్వహించింది చిత్రయూనిట్. ఈ వేడుకలో ఆర్జీవీ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ గురించి మాట్లాడుతూ.. నేను బెట్టింగ్ యాప్స్ గురించి తెలియదు. ఎందుకంటే ఇంతకుముందు కూడా నేను ఎటువంటి యాడ్‌లలో నటించలేదు. అలాగే నా సోషల్ మీడియా అకౌంట్స్‌ని కూడా ప్రమోషన్‌కి వాడలేదు. ఒకవేళ నేను ప్రమోట్ చేయాలి అనుకుంటే వోడ్కానే ప్రమోట్ చేస్తా.. బెట్టింగ్ యాప్స్ కాదు. ఎందుకంటే కొన్ని ప్రమోట్ చేయాలంటే అవి లీగలా కాదా అనేది ఎవరికి తెలిసి ఉండదు. ప్రభుత్వం ఇవి లీగల్ అని ప్రజలకు అవగాహన కల్పించాలి. స్టార్ నటులను తీసుకుంటే బెట్టింగ్ యాప్స్ కాకుండా చాలా బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తూ ఉంటారు. అవి లీగల్ అని ఎలా తెలుస్తది. సడన్‌గా ఒకరోజు వచ్చి అవి ప్రమోట్ చేయడం నేరం అంటారు. ఇలాంటివి చేసే ముందు ప్రభుత్వం అవేర్‌నెస్ క్రియేట్ చేయాలంటూ ఆర్జీవీ చెప్పుకొచ్చాడు.





## మండుటెండల్లోనూ
# నిండా ముంచే

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన తీరు
- ఈదురుగాలులకు వందల ఎకరాల్లో రాలిపోయిన మామిడి
- విరిగిపడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- చాలా చోట్ల కరెంటు సరఫరాకు అంతరాయం
- కాగజ్‌నగర్‌లో గోడకూలి వృద్ధుడి మృతి
- గాలివానకు ఉమ్మడి ఆదిలాబాద్ ఆగమాగం..







**ఆసిఫాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. వడగండ్లు పడటంతోపాటు భారీగా ఈదురుగాలులు వీయడంతో చెట్లు విరిగిపడ్డాయి. కాగజ్నగర్ ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడి ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోచమ్మ గుడి వద్ద 150 ఏళ్ల భారీ మర్రి చెట్టు నేలకొరిగింది. కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ సమీపంలో రహదారిపై విద్యుత్ తీగలు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగజ్ నగర్ రూరల్ ఎస్సై సందీప్కుమార్ ఘటనస్థలికి చేరుకుని సిబ్బందితో కలిసి విద్యుత్ తీగలను పైకెత్తి పట్టుకుని వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. పట్టణంలోని నౌగాంబస్తీలో ఇంటి గోడ కూలి దావులత్ (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని ఈజ్‌గాం శివాలయం ఆవరణలోని షెడ్డు కూలిపోయింది. ఈజ్గాం, సీతానగర్, నామానగర్, జంబుగ తదితర గ్రామాల్లో ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. కాగజ్ నగర్- పెంచికల్పేట్ రహదారిలో చెట్లు నేలకూలడంతో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. స్తంభాలపై చెట్లు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. కౌటాల మండలంలో గాలివానతో కౌటాల- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై కుమురంభీం చౌరస్తా వద్ద చెట్టు పడింది. సదాశివపేట కాలనీలో కౌటాల- బెజ్జూర్ ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడింది. కౌటాల పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ జేసీబీతో చెట్లను తొలగించి ట్రాఫికు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కనికి గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చింతలమానేపల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం కురిసింది. గూడెం- కర్జెల్లి రోడ్డు బురదమయంగా మారింది. విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ నిలిచిపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. దహెగాం మండలంలో వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మిర్చి తోటల్లో పంట నేలరాలింది. మామిడి తోటల్లో కాయలు రాలిపడటంతో రైతులకు నష్టం వాటిల్లింది. తిర్యాణి మండలంలోని అటవీ ప్రాంతంలో భారీ వర్షానికి గుండాల జలపాతం ఉప్పొంగింది. జలకళను సంతరించుకుంది. గాలులకు చెట్లు కూలడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రెబ్బెన మండలంలో ఈదురుగాలులు, వడగండ్ల వానతో తీవ్ర నష్టం వాటిల్లింది. రెబ్బెన, గోలేటి, వరదలగూడ, గొల్లగూడ, నంబాల తదితర గ్రామాల్లో బలమైన ఈదురు గాలుల ధాటికి చెట్లు నేలకొరిగాయి. పదుల సంఖ్యలో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని ఆర్అండీబీ గెస్ట్ ఆవరణలో ఉన్న షెడ్డు, గొల్లగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్లు నామరూపాలు లేకుండా దెబ్బతిన్నాయి. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన రోడ్డుపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గోలేటి టౌన్షిప్ సింగరేణి సబ్ స్టేషన్ సమీపంలో భారీ నీలగిరి వృక్షం విరిగి విద్యుత్ తీగలపై పడింది. కార్మిక కాలనీల్లోనూ చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటంతో విద్యుత్ సరాఫరా నిలిచిపోయింది. వరదలగూడ గ్రామానికి చెందిన కోడిపుంజుల సంతోష్ ఇంటిపై చెట్టు కొమ్మలు విరిగిపడి ఇల్లు ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అదే గ్రామానికి చెందిన దేనవేణి తిరుపతి, మంత్రి తిరుపతి, పోగుల రమేశ్, అప్పాల రవి, గోగారం రాజేశ్ తోపాటు పలువురి ఇళ్ల ఎదుట వేసిన రేకుల షెడ్ల పైకప్పు రేకులు ఎగిరి దూరంగా పడ్డాయి. మండల కేంద్రానికి చెందిన సత్రపు సత్తయ్య ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనంపై చెట్టు విరిగి పడ్డాయి. బైక్ తీవ్రంగా దెబ్బతింది. ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాల ఎదుట రేకులు లేచిపోయాయి.











## కుటుంబ తగాదాల్లో వ్యక్తి మృతి

**కన్నెపల్లి, మార్చి 21(ప్రభాత సమాచారం)**



మండలంలోని వెంకటపూర్ గ్రామ పంచాయతీలో కుటుంబ తగాదాల్లో మామ, బావమరిది దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటపూర్ గ్రామానికి చెందిన చదువుల లక్ష్మణ్ (35) మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్య రోజ అలియాస్ సమతతో గొడవ పడేవాడు. శుక్రవారం కూడా భార్యతో తీవ్రస్థాయిలో గొడవపడ్డాడు. ఈక్రమంలో రోజ తండ్రి పార్వతి రాజేశం, తమ్ముడు పార్వతి లక్ష్మణ్‌పై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

## జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలి

**ఆసిఫాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులు జీవతంలో ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జన్కాపూర్లోని పాత కలెక్టరేట్ భవనంలో గల టాస్క్ కేంద్రంలో 40 రోజుల కంప్యూటర్ శిక్షణ పొందిన అభ్యర్థులకు శుక్రవారం డీఆర్డీవో దత్తారావుతో కలిసి సర్టిఫికెట్లు అందించారు. 40 రోజులపాటు కంప్యూటర్ శిక్షణ, టైపింగ్ మెలకువలు నేర్పించినట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. శిక్షణ కేంద్రం సమన్వయకర్త సాయికుమార్ పాల్గొన్నారు.



## తెలంగాణ క్షేత్రాలు- అక్షర దర్శనం సదస్సు

**మంచిర్యాల, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ క్షేత్రాలు-అక్షర దర్శనం అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. రెండ్రోజులపాటు సదస్సు నిర్వహిస్తారు. 35 మంది పరిశోధకులు పత్రాలను సమర్పించా రు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల క్షేత్రాలపై పత్రాలను సమర్పించారు. రెండో రోజు శనివారం నాలుగు సెషన్లు కొనసాగనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సంగనభట్ల నర్సయ్య, గంధ్ర లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

## వేధింపులు తాళలేక వ్యక్తి బలవన్మరణం

**రెబ్బెన, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

ఓ వివాహిత మహిళతో పాటు కొంతమంది నాయకులు వేధించడంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గంగాపూర్లో చోటు చేసు కుంది. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్ గ్రామానికి చెందిన గుండ్ల ప్రకాశ్ (53) గంగాపూర్ గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన గుర్లె సోనీ అనే వివాహిత ప్రకాశ్‌కు మద్యం అలవాటు చేయడంతో పాటు అప్పుడప్పుడూ ప్రకాశ్ వద్ద నుంచి అవసరానికి డబ్బులు తీసుకునేది. సోనికి ఇచ్చిన డ బ్బులను తిరిగి ఇవ్వాలని ప్రకాశ్ కోరగా నిరాకరించ డంతో పాటు తనకే రూ. లక్ష బాకీ ఉన్నావని ఎప్పుడు ఇస్తావంటూ వేధించింది. డబ్బులు ఇవ్వకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరింపులకు పాల్పడింది. వేధించడంతో ప్రకాశ్ పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నాడు.



# విద్యార్థులకు వినికిడి పరికరాలు పంపిణీ

**ప్రత్యేక గిరిజన విద్యార్థులకు వినికిడి పరికరాలను ఆశ్రయ్ ఆకృతి ఆధ్వర్యంలో అందజేయడం అభినందనీయం - ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా**

**ఉట్నూర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ప్రత్యేక గిరిజన విద్యార్థులకు వినికిడి పరిక రాలను ఆశ్రయ్ ఆకృతి హైదరాబాద్ ఆధ్వర్యంలో అందజేయడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని కేబీ కాంప్లెక్స్ వికాసం బాలబడిలో ఆశ్రయ్ ఆకృతి హైదరా బాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వినికిడి పరికరాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. 10లక్షలు విలువ గల వినికిడి పరికరాలు విద్యార్థినులకు అందించారు. ఇలాంటి సేవ కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని సూచించారు. అనంతరం కేబి కాంప్లెక్స్ లోని పీఏమ్మార్సీ భవనంలో గాదిగుడ, నార్నూర్, ఉట్నూర్, మండలాల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విభాగాలపై ఐటీడీఏ పీఓ సమీక్ష నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను నిర్వహించాలని పంచాయతీ సెక్రటరీలకు పీఓ సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని, అధికారులే తాగు నీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలన్నారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని హ్యాబిటేషన్ గ్రామాలలో తాగు నీరు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆవాసాలపై సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకోరావాలని, తాగు నీటి కోసం ఇబ్బందులు పడే గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అదేశించారు. నిత్యం క్లోరినేషన్ జరిగే విధంగా చూడాలని అదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఈఈ తనాజీ, ఎపిఓ పీవిటీజీ మనోహర్, డీఈ శివప్రసాద్, ఏటీడీపీ క్రాంతి, డీఎల్పీఓ ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

# టీపీబీవోగా సాయికృష్ణ

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీవో)గా జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన అంగునూరి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఎస్.దేవేందర్రెడ్డి ఉత్తర్వులు జారీ చే శారు. శుక్రవారం సాయికృష్ణ మున్సిపల్ కమి షనర్ సీవీఎన్ రాజును ఆయన కార్యాలయంలో కలిసి రిపోర్ట్ చేశారు. కమిషనర్కు పుష్పగుచ్ఛం అందజేసి తనను తాను పరిచయం చేసుకున్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది.

## అక్రిడిటేషన్ కార్డుల గడువు..
# మూడు నెలలు పొడగింపు

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పొడగించారు. ఇప్పుడున్న అక్రిడేషన్ల పొడగింపు మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువును మరో మూడు నెలల పొడగించాలని సమాచార పౌరసంబంధాల శాఖ నిర్ణయించింది. జూన్ చివరి వరకు ఇప్పుడున్న అక్రిడేషన్లు అమల్లో ఉంటాయి. కొత్త అక్రిడేషన్ కార్డుల జారీకి సంబంధించి మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది. తరువాత అక్రిడేషన్ కమిటీల ఏర్పాటు, దరఖాస్తుల స్వీకరణ, కొత్త జారీ ప్రక్రియ సాగనుంది.




# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి






**మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్**

**మంచిర్యాల, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
ఎల్ఆర్ఎస్- 2020 పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల వారు రుసుము చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి, జోనల్ కమీషనర్ అపూర్వలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని లే- అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులలో అర్హులైన దరఖాస్తుదారులు ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం ఫీజు తగ్గించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంపై ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులకు వివిధ ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం అందించి ఫీజు చెల్లించే విధంగా విస్తృత ప్రచారం చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో అర్హులైన ప్రతి లబ్దిదారుడు రుసుము చెల్లించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎఫ్.టి.ఎల్. / నిషేధిత భూములకు సంబంధించి ఎల్-2 లాగిన్లో ఆప్షన్ ఇవ్వడం జరిగిందని, నూతన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రుసుము చెల్లించిన వారికి పట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపల్ కమీషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు, మండల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎల్.ఆర్.ఎస్.-2020 పథకంలో అర్హులైన అభ్యర్థుల నుండి రుసుము చెల్లించే విధంగా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుల మొబైల్ నంబర్, చిరునామా వివరాలు తీసుకోవడం జరిగిందని, వారికి ఫోన్ కాల్ చేసి రుసుము చెల్లింపు వివరాలు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఎఫ్.టి.ఎల్./నిషేధిత భూములకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యమ్రంలో మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ కాలువలో
# పడి విద్యార్థి మృతి

**చింతలపల్లెలో విషాదఛాయలు**



**జన్నారం, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మ పెల్లి సమీపంలోని కాకతీయ కాలువలో ప్రమాదవశాత్తు పడి జన్నారం మండలం చింతలపల్లె గ్రామానికి చెందిన వాసాల అరవింద్ (21) అనే విద్యార్థి మృతి చెందాడు. అరవింద్ కరీంనగర్లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ లో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అరవింద్ రెండు రోజుల క్రితం అతని స్నేహితులతో కలిసి కాలువలో ఈతకు వెళ్ళాడు. అతనికి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. అరవింద్ మృత దేహాన్ని పోలీసులు బయటకు తీసి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరవింద్ మృతి విషయం తెలియగానే తల్లితండ్రులు లింగన్న, శంకరవ్వతో పాటు బంధువులు కరీంనగర్ వెళ్లారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రమాదాల నివారణే లక్ష్యంగా
# డ్రంక్ అండ్ డ్రైవ్

**గుడిహత్నూర్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై మహేందర్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.



# కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 'పది' పరీక్షలు షురూ



**పది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**ఆసిఫాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**
పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 36 పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు లాంగ్వేజ్ పరీక్షకు 6,560 మంది విద్యార్థులకు 6,531 మంది హాజరు కాగా, 29 మంది గైర్హాజరయ్యారని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయాబాబు తెలిపారు. 99.5 శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు. జన్కాపూర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సందర్శించారు. విద్యార్థుల హాజరు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాకోవాలన్నారు. సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ స్కూల్ను ఎస్సీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. అలాగే జిల్లాకేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ డేవిడ్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్బాబు, ఆర్డీవో లోకేశ్వర్రావు పర్యవేక్షించారు. వాంకిడి, కెరమెరి, ఈజ్ ంలోని పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

# జైపూర్‌లో అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్



- జైపూర్‌లో మూడవ యూనిట్‌కు శంకుస్థాపన
- సీఎం పర్యటనకు రెండు రోజులుగా ఏర్పాట్లు
- అనుకూలించని వాతావరణం..
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- ఇంకా అధికారికంగా ఖరారు కాని షెడ్యూల్
- సీఎం రాకకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**మంచిర్యాల, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) ఆవరణలో సింగరేణి సంస్థ కొత్తగా నిర్మించనున్న 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్ కు శంకుస్థాపనకు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. మొదట ఈ నెల 23న సీఎం పర్యటన ఉంటుందని జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఆ మేరకు ప్లాంట్ సింగరేణి, పోలీసులు, స్థానిక అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంకా అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదు. గతంలోనే మూడో యూనిట్ నిర్మాణం చేపట్టాలని సింగరేణి నిర్ణయం తీసుకుని, పనులు ప్రారంభించాలని ప్రణాళికలు వేసింది. నేటికీ సీఎం పర్యటన ఖరారు కాకపోవడంతో సింగరేణి అధికారులు ఎదురు చూస్తున్నారు. రూ.6700 కోట్లతో చేపడుతున్న కొత్త ప్లాంటు నిర్మాణానికి సంబంధించి టెండర్లు పూర్తయి అంతా సిద్ధమైంది. అధికారికంగా పనులకు శంకుస్థాపనే మిగిలింది. గత పదేళ్లుగా ఇక్కడ మూ డో యూనిట్ ప్రారంభం చేయాలని ప్రణాళిక వేసినా, సాంకేతిక కారణాలతో తాత్సారం జరుగుతోంది. తాజాగా సీఎం పర్యటన ఖరారైతే మోక్షం కలగనుంది.

**అనుకూలించని వాతావరణం...**

సీఎం పర్యటనకు బీజీ షెడ్యూల్ తోపాటు హెలికాప్టర్‌లో రాకపోకలు సాగించేందుకు వాతావరణం అనుకూలత లేకపోవడం ఓ కారణంగా కనిపిస్తోంది. గత రెండు రోజులుగా వాతావరణ పరిస్థితులు మారిపోవడంతో హెలికాప్టర్ ప్రయాణానికి అసౌకర్యం ఏర్పడుతున్నట్లు తెలిసింది.

**జైపూర్‌లో అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్**

జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి సంస్థ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో అదనంగా మంజూరైన మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైపర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ పరిధిలో అదనంగా మంజూరైన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌కు సంబంధిత శిలాఫలకం, హెలీప్యాడ్, బహిరంగ సభ ఏర్పాటు చేసే స్థలం వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జీఎం, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జైపూర్‌లోని సింగరేణి విద్యుత్ ప్లాంట్‌లో 9వేల 500 కోట్ల రూపాయల వ్యయంతో అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ మంజూరు అయిందని తెలిపారు. విద్యుత్ ప్లాంట్ పనులను రాష్ట్ర ప్రముఖులచే ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖ అధికారులు త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రపతి భవన్‌లో విందు..హాజరైన ఎంపీ నగేష్

**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తేనేటి విందు కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన పార్లమెంట్ సభ్యులు ఒక్కచోట కలవడం శుభసూచకమని నగేష్ అన్నారు. ఒడిశా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, గోవా అండమాన్, నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీ. ఇతర రాష్ట్రాల జాతీయ, ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన కీలక అంశాలపై చర్చలకు ఇది ఒక విలువైన వేదికను అందించిందని పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాల్లో ఈ గౌరవ ప్రదమైన సభలో భాగం కావడం ఆనందం దాయకం అని బీజేపీ శ్రేణులు పేర్కొన్నారు.



## బాసరలో ప్రత్యేక పూజలు

**ముథోల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా బాసరలో బ్రహ్మశ్రీ శ్రాతి రాజేశ్వరి శర్మ - సునీత దంపతులు మహారుద్ర సహిత అష్టోత్తర శత సువాసిని సమారాధన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ జ్ఞానసరస్వతి, మహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అర్చ న పూజలు నిర్వహించారు. అనంతరం గురుప్రార్థన ఉత్సవ సంకల్పం, 108 మంది బ్రాహ్మణోత్తములతో 1331 రుద్ర పారాయణం, 1000 శ్రీ సూక్తాపారాధనలు జరిపించారు. నాట్యమండలి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో చిన్నారులతో భరతనాట్య ప్రదర్శన నిర్వహించగా, తొగుట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి హాజరయ్యారు. వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. నేడు 108 సువాసినీ సమారాధన కార్యక్రమం, స్వామి వారి పాదపూజ మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రాతి రాజేశ్వర శర్మ తెలిపారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

**ఖండాలలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు**

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

ఖండాల గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఖండాల గ్రామంలో 68 కుటుంబాలు, 342 జనాభా ఉందని, ఖండాల గ్రామం నుండి 4కిలోమీటర్ల దూరంలో వాగు వద్ద బోర్‌వెల్ వేసి అక్కడి నుండి పైపు లైను ద్వారా ఖండాల గ్రామంలోని జీఎల్ఆర్ఎస్ ట్యాంకు ద్వారా ఉదయం 7:00 గంటలకు, సాయంత్రం 6:00 గంటలకు రోజుకు 10,000 లీటర్ల నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఉదయం ఒక గంట పాటు, సాయంత్రం ఒక గంట నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఖండాల గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడవతో నీటి సరఫరా నిర్ణీత సమయంలో చేయడం జరుగుతుందని, ప్రత్యామ్నాయ దిశగా ట్యాంకర్ల ద్వారా నీటిని అవసరమైన సందర్భంలో గ్రామ పంచాయతీ ట్యాంకరు ద్వారా సరాఫరా చేయడం జరుగుతుందన్నారు. మిషన్ భగీరథ నీరు రెండు రోజులకోసారి వస్తున్న సందర్భంలో తీవ్ర సమస్య ఏర్పడుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారని, అయితే గ్రామస్థులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా గ్రామంలో నిర్మించిన చిన్నపాటి ట్యాంకు సమీపంలోని బోరు బావి నుంచి పైపులైన్ కనెక్షన్ ఇచ్చి దాని ద్వారా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సార్లు ఆ ట్యాంకును నింపడం జరుగుతుందని, దీంతో ఉదయం 5 వేల లీటర్లు, సాయంత్రం ఐదు వేల లీటర్లను ప్రజలకు అందిస్తున్నామన్నారు. భూగర్భజలాలు అడుగంటి పోవడం ద్వారా నీటి సమస్య తలెత్తుతుందని అందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బావుల్లో నీరు అడుగంటిపోతున్న సందర్భంలో నీరు బురదగా వస్తున్నాయని, గ్రామస్తులు అవే నీరు తాగటం వల్ల అనారోగ్యానికి గురవుతారని, ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎక్కడో దూరంలో ఉన్న బావి దగ్గరికి వెళ్లి నీరు తెచ్చుకోవడం కన్నా ఇంట్లోనే భగీరథ నల్లాల ద్వారా నీటిని వినియోగించుకోవాలన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## బాసర ట్రిపుల్ ఐటీలో టెక్‌ఫెస్ట్



**ముథోల్, మార్చి 21 (ప్రభాత సమాచారం)**

బాసర ట్రిపుల్ ఐటీలో శుక్రవారం అంత:ప్రజ్ఞ టెక్‌ఫెస్ట్-2025 ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జీ వీసీ గోవర్ధన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణలను అన్వేషించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలన్నారు. బాసర ట్రిపుల్ ఐటీని దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా మారుస్తామని పేర్కొన్నారు. వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ ఈ టెక్ఫాస్ట్ విద్యార్థుల ప్రతిభకు నిలయమని ప్రశంసించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో ప్రొఫెసర్లు మురళీధర్షన్, రణధీర్‌సాగి, విట్టల్, మహేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

**యాక్టివిటీ సెంటర్ ప్రారంభం..**

ట్రిపుల్ ఐటీలో యాక్టివిటీ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ పురుషోత్తం, ట్రిపుల్ ఐటీ ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రారంభించారు. విద్యార్థుల సంక్షేమం, పాఠ్యేతర కార్యకలాపాలను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలలో ఈ యాక్టివిటీ సెంటర్ మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి కేంద్రీకృత చొరవల ప్రాముఖ్యతను వివరిస్తూ సమగ్ర విద్య అనుభవాన్ని అందించడంలో విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేశామని వీసీ తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ, సమాజ సేవను ప్రోత్సహించడం లక్ష్యమన్నారు.